ప్రేమ కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# పరస్పరం

వసుంధర

"ప్రియమైన శ్రీమతి సత్యవతికి —

మనమిద్దరం మనసారా ప్రేమించుకున్నాం. తనువు లేకం కాకున్నా మన మనసులెప్పటికీ ఒకటే అనుకున్నాం. పరిస్థితులు అనుకూలించలేదు. నీ పెళ్ళి రఘురాంతో జరిగిపోయింది. నీవు, రఘురాం అన్యోన్యంగా జీవించడానికి మన ప్రేమ అడ్డురాలేదని తెలిసి ఎంతో సంతోషించాను.

నాకు పెళ్ళయింది. నా భార్యకు నా మీద ఆశే తప్ప ప్రేమ లేదు. ఆమె నాకు ప్రతిఫలాన్నే తప్ప ప్రేమనివ్వదు. ప్రేమతో ఒక స్త్రీని దగ్గరగా తీసుకుని లాలిస్తూ, లాలించబడుతూ ప్రేమానుభూతితో ఆమె నన్ను తనలో ఐక్యం చేసుకునే అనుభవం కోసం తపించిపోతున్నాను. ఒక్కసారైనా అటువంటి అనుభవం లభ్యం కాకపోతే జీవితం వ్యర్థమనిపిస్తోంది.

నేనెప్పుడేది అడిగినా కాదనని మాటిచ్చావు. అప్పట్లో సమాజ నియమాలను ఉల్లంఘించకూడదనుకున్నాను కాబట్టి అలాగైపోయింది. ఇప్పుడు నేను సంప్రదాయాన్నీ, సమాజ నియమాలనూ ఉల్లంఘిస్తూ నువ్వే కావాలని అడుగుతున్నాను. అదీ తాత్కాలికంగా!

ఈ కవర్లో ఒక ఎర్ర కాగితం, పచ్చకాగితం, నా అడ్రసు ఉన్న కవరు ఉన్నాయి. ఎర్ర కాగితం కవర్లో పెట్టి పోస్టుచేస్తే జీవితంలో మళ్ళీ నీకు కనబడను. పచ్చకాగితం కవర్లో పెట్టి పోస్టు చేశావో — అది మన ప్రేమకు తిరుగులేని ఋజువు. అప్పుడు నేను అన్ని ఏర్పాట్లూ చేసి మళ్ళీ నీకు తెలియబరుస్తాను.

ఎర్రకాగితం నీ దగ్గరే ఉండిపోతుందని నాకు తెలుసు. పచ్చకాగితం కోసం ఎదురుచూస్తూ —

ఎప్పటికీ నీ ప్రియుడు
విశ్వం

ఆ ఉత్తరాన్ని పదే పదే చదువుకున్నాను. ముందు శరీరంలో గగుర్పాటు కలిగింది. ఆ తర్వాత మనసులో రవంత ఆశ్చర్యం పుట్టింది.

ప్రేమంటే ఏమిటో నాకు తెలియదు. కానీ ఆ రోజుల్లో నేను విశ్వాన్ని ప్రేమించాననే అనుకున్నాను.

విశ్వం నాకంటే ఆరేళ్ళు పెద్ద. నాకు పదేళ్ళ వయసులో పరిచయమయ్యాడు. ఆ తర్వాత మా పరిచయం వయసు పదేళ్ళు.

వాళ్ళు మా యింట్లోనే అద్దెకుండే వారు. విశ్వం అక్కడే గ్రాడ్యుయేటయ్యాడు. అక్కడే ఉద్యోగం సంపాదించాడు. కొన్నేళ్ళపాటు ఉద్యోగం చేసి ధనార్జన కోసం దుబాయ్ వెళ్ళడంతో మేము విడిపోయాం. అతడు దుబాయ్ వెళ్ళడానికి రెండేళ్ళ ముందే నాకు పెళ్ళయింది. రఘురాం — తన బామ్మ సరదా తీర్చడంకోసం నన్ను పెళ్ళి చేసుకున్నా — ఆ తర్వాత రెండేళ్ళకే నన్ను కాపురానికి తీసుకుని వెళ్ళాడు. ఎందుకంటే అప్పుడే అతడికి ఉద్యోగం దొరికింది.

విశ్వం నాకు మంచి స్నేహితుడు. అతడు నాకు పాఠాలు చెప్పేవాడు. ప్రపంచ విశేషాలు చెప్పేవాడు. ఆటల గురించి వివరించేవాడు. ఈ విశ్వంలో అతడికి తెలియందేమైనా ఉందా అనిపించేది.

విశ్వం మాటల్లో వెకిలితనంగానీ, చూపుల్లో అదోరకంగానీ మచ్చుకు కూడా నాకు కనిపించేవి కాదు. అతడి సంస్కారానికి మా యింట్లో వాళ్ళు కూడా ముగ్ధులయ్యారేమో పన్నెండో యేటే నేను పెద్ద మనిషైనా మరో ఎనిమిది సంవత్సరాల పాటు మా స్నేహం నిరాటంకంగా కొనసాగిపోయింది.

మా స్నేహమెలాంటిదో నాకు తెలియదు. అతడిని చూడాలనుండేది. చూడకపోతే మనసు కొట్టుకుపోయేది. చూడగానే మనసానందంతో ఉప్పొంగిపోయేది. అతడి సమక్షంలో గంటలు క్షణాలయ్యేవి.

పదహారేండ్ల వయసులోనే నా స్నేహితురాండ్రు ఒకరిద్దరు ప్రేమలో పడి గొప్పగా చెప్పుకునేవారు. అది తప్పుకాదా అని నేనంటే, "మేము చెప్పుకుంటున్నాం. కొందరు చెప్పుకోరు. ఏం — నీకు విశ్వం లేడా?" అందొకమ్మాయి.

అంతవరకూ నేను విశ్వాన్నీ ప్రేమనూ కలిపి ఆలోచించలేదు. ప్రేమంటే నాకు తెలియదుకానీ అందరూ అదొకరకమైన అర్థం చెప్పుకుంటారు.



ఆ అర్థాన్ని విశ్వానికి అన్వయించడం కష్టమే అనిపించి చివరకు నేనొక రోజు అతడినే అడిగేశాను

అప్పటికి విశ్వం కొత్తగా ఉద్యోగంలో చేరాడు.

''నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు కాబట్టే ఇలాంటి ప్రశ్నను కూడా నిస్సంకోచంగా నిర్భయంగా నన్నడిగావు. ప్రేమికుల మధ్య రహస్యాలుండవు'' అన్నాడు విశ్వం.

''నువ్వూ నన్ను ప్రేమిస్తున్నావా?'' అనడిగాను ఆశ్చర్యంగా.

''నేను నిన్ను పదేళ్ళ వయసునించే ప్రేమిస్తున్నాను. నాకైతే నిన్ను పెళ్ళిచేసుకోవాలని కూడా ఉంది. కానీ ఇప్పట్లో నా పెళ్ళి కుదరదు...'' అన్నాడు విశ్వం.

పెళ్ళి అనగానే సిగ్గేసినా కుతూహలం ఆ సిగ్గును నొక్కేసింది. కారణమడిగాను.

''నేను నిన్ను ప్రేమించానుగా. ప్రియురాలే భార్యయితే జీవితాంతం మహారాణిలా చూసుకోవాలనుంటుంది. అందుకు తగ్గ డబ్బు సంపాదించాలంటే చాలాకాలం పడుతుంది. అంతవరకూ మీ వాళ్ళాగరని నాకు తెలుసు'' అన్నాడు విశ్వం.

అప్పట్నించీ మేమిద్దరం ప్రేమ గురించి మాట్లాడుకునే వాళ్ళం. విశ్వం ప్రేమ గురించి చెప్పే మాటలు విచిత్రంగానూ, నలుగురికీ భిన్నంగానూ ఉండేవి. అతడిని అడిగి నేను చాలా సందేహాలు తీర్చుకున్నాను.

కారణం లేకుండా ప్రేమ పుట్టదు. తల్లి తన రక్తం పంచుకు పుట్టాడని బిడ్డను ప్రేమిస్తుంది. బిడ్డ పాలు తాగి తల్లిని ప్రేమిస్తాడు. సాన్నిహిత్యం వారి ప్రేమను పెంచుతుంది. అప్పుడు వారికొకరిని చూస్తే ఒకరికి ఆనందంగా ఉంటుంది. ప్రేమలో ప్రతిఫలాపేక్ష ఉండదు.

తొలిచూపులో కలిగేది ప్రేమకాదు. సాన్నిహిత్యంలో పెరిగేదే ప్రేమ.

ప్రేమికుల మధ్య సంకోచాలుండవు. స్వార్థముండదు.


తన డబ్బుతో నాకేమైనా మంచి బహుమతి కొనివ్వాలని విశ్వానికుండేది. కానీ అతడా పని చేసేవాడు కాదు. ఎందుకంటే అది అపార్థాలకు దారి తీస్తుందట. ప్రేమ అలాంటివి లెక్కచేయదు

. కానీ తనవల్ల ప్రియురాలు ఇబ్బంది పడకూడదని ప్రియుడాశిస్తాడు. అందువల్ల ప్రేమ పేరుతో సమాజాన్నెదిరించే మూర్ఖత్వానికి తలపడడు.



# కార్టూన్స్ వేయడం ఎలా? 96

***సత్యమూర్తి సలహాలు**





బి.వి. సత్యమూర్తి, శ్రీ సత్యసాయి డిజైనింగ్ స్టూడియోస్
11-4-661, రెడ్‌హిల్స్, హైదరాబాద్-500 004.


విశ్వం మా యింట్లో పెద్దవాళ్ళకు తరచుగా చిన్న చిన్న కానుకలిచ్చేవాడు. అందువల్ల వాళ్ళందరికీ అతడంటే సదభిప్రాయం. అడపాతడపా మా యింట్లో నేనూ, వాళ్ళింట్లో అతడూ మాత్రమే ఏకాంతంగా ఉండే సందర్భాలేర్పడేవి. అప్పుడు మేము రహస్యంగా కలుసుకుని మాట్లాడుకునేవాళ్ళం. అందులో పెళ్ళి ప్రసక్తి ఉండేది. చాలా విషయాలు విస్పంకోచంగా మాట్లాడుకునేవాళ్ళం. శరీర విశేషాల గురించి ఉద్రేకం పుట్టని విధంగా చెబుతూండేవాడు. కానీ ఏకాంతంలో అప్పుడప్పుడు నాలో ఉద్రేకం పుట్టేది.

అలాంటి ఏకాంతంలో ఒకరోజున నేనతడిముందు బట్టలు విప్పుకోసాగాను. విశ్వం కంగారు పడి, "ఏమిటి నువ్వు చేస్తున్నది?" అన్నాడు.

"నీ ముందు నాకే సంకోచమూ లేదు. మన ప్రేమను బుజువు చేస్తున్నాను" అన్నాను.

నా వంటిమీద ఒకటొకటిగా బట్టలు తొలగిపోతూంటే అతడు వెనక్కు తిరిగి, "నీవు చాలా అందగత్తెవు. నీ అందానికి తేజస్సుంది. అది నేను చూడలేను" అన్నాడు.

నాకు సిగ్గు, అవమానం అనిపించి, "నీకు నామీద ప్రేమలేదు" అన్నాను.

"పెళ్ళి కాని వయసులో తాత్కాలికోద్రేకానికి ప్రేమ అని నువ్వు పేరు పెడితే అది ప్రేమ అయిపోదు. పెళ్ళయ్యాక కోర్కెలు చల్లారేక ఇంకా వయసులో ఉండగానే నేను నీ దగ్గరకు వస్తాను. అప్పుడు నీ ప్రేమను బుజువుచేసుకో!" అన్నాడు విశ్వం.

"అయితే గుర్తుంచుకో — నువ్వెప్పుడేది అడిగినా నేను కాదనను" అన్నాను.

ఆ తర్వాత కూడా మేము ఏకాంతంలో కలుసుకునేవాళ్ళం. ఈలోగా నాకు పెళ్ళి కుదిరింది. నాకు దుఃఖం వచ్చింది. విశ్వం దగ్గర ఏడ్చాను.

"ప్రేమకూ పెళ్ళికీ సంబంధం లేదు. ప్రేమ పెళ్ళితో అంతమూ కాదు. నీవు నీ భర్తకు అనురాగాన్ని పంచుతూ సుఖపెట్టు. మన ప్రేమ కలకాలమూ ఉంటుంది" అన్నాడతడు.

నాకు పెళ్ళయింది. రఘురాం నాకు నచ్చాడు. అతడికి నేనంటే ప్రాణం. అతడిని చూడగానే దగ్గరగా చేరాలనిపించేది. అతడితో ఏకాంతంలో సుఖముండేది.

పెళ్ళైనా పుట్టింట్లోనే ఉండడం వల్ల నాకూ విశ్వానికీ ఏకాంతానికి లోటులేదు. ఒకటి రెండుసార్లు నేనతడిముందు నా ప్రేమను బుజువు చేసుకోవాలనుకున్నాను.

"నీ ప్రేమను పొందడం నా అదృష్టం. కానీ పెళ్ళయ్యాక పర పురుషుడితో సంపర్కం పెట్టుకుని మానసికంగా నువ్వు సుఖపడలేవు. జీవితాంతం కుమిలిపోయే స్థితికి నిన్ను తీసుకువెళ్ళి నేనూ



## లైవ్‌ు

అర్ధరాత్రి హఠాత్తుగా గిటార్ తీసుకుని వాయించడం మొదలు పెట్టాడు రాంబ్రహ్మం. రెండు నిముషాలయిన కాకముందే పక్కింటి పార్వతి పరిగెత్తుకుంటూ వచ్చింది.

"ఏమయ్యా! నీకు బుర్ర వుందా రాత్రి రెండున్నర గంటలవేళ ఈ గిటారేమిటమ్మా ఎవర్నీ నిద్రపోనివ్వవా!" అని అరిచింది.

"అబ్బే — టైమెంతైందో తెలుసుకుందామనేనండీ" అన్నాడు రాంబ్రహ్మం వినయంగా.

— పద్మశ్రీ (నాగారం)

సుఖపడలేను. నన్ను ప్రేమిస్తున్నావు కాబట్టి నా ముందు నీకు సంకోచం లేదు. నిన్ను ప్రేమిస్తున్నాను కాబట్టి నేను నీ ప్రేమను స్వార్థాని కుపయోగించుకోలేను" అన్నాడు విశ్వం.

ఆ తర్వాత కొంతకాలానికి అతడు దుబాయ్‌కీ, నేను కాపురానికీ వెళ్ళడం జరిగింది.

ఇప్పుడు నాకు ఇద్దరు పిల్లలు. పెద్దవాడికి అయిదేళ్ళు. రెండోదానికి మూడేళ్ళు. నా వయసెంతైనా పార్టీలకు వెడితే అంతా నాకు పెళ్ళి కాలేదనుకుంటారు. వయసిరవైకి లోపే అనుకుంటారు.

రఘురాం అందగాడు. ఆఫీసరు. సంపాదన గొప్పగా లేకపోయినా రోజులు సుఖంగానూ, గౌరవంగానూ వెళ్ళిపోతున్నాయి.

ఇప్పుడీ ఉత్తరం...

ఏమయింది విశ్వానికి? కన్నెపిల్లగా, నూత్న వధువుగా ఉన్నప్పుడు అమాయకంగా అతడిముందు నిలబడి నన్ను నేనర్పించుకుంటానంటే కాదన్నాడు. ఇప్పుడు నాలో అమాయకత్వం లేదు. రఘురాం పూర్తిగా నావాడే అవడానికి మా సాన్నిహిత్యమే కాక మా యిద్దరు పిల్లలూ కూడా నిదర్శనంగా ఉన్నారు.

అన్నింటికీ మించి రఘురాం చాలా పొజెసివ్‌గా ఉంటాడు — ముఖ్యంగా నా విషయంలో. నావైపెవరైనా కన్నెత్తి చూసినా, అభిమానంగా నవ్వినా వాళ్ళతో గొడవపెట్టుకుంటాడు. నేనెవరినైనా మగవాళ్ళని మెచ్చుకుంటే అసూయతో కుమిలిపోతాడు. తన్ను చిన్నబుచ్చాననుకుని కృంగిపోతాడు. నన్ను మాత్రం దేనికీ పల్లెత్తుమాట అనడు.

అతడి మానసిక స్థితి తెలిసి అనుక్షణం అతడికి అనుమానం రాకుండానూ, సంతోషంగా ఉండేలాగానూ ప్రయత్నించడంలోనే రోజు గడిచిపోతుంది నాకు. ఆ విధంగా రఘురాం నా మనసు నాక్రమించుకునే ఉంటున్నాడు. అతడికి నాపై అనురాగం పెరిగిపోతోంది.

అలాంటప్పుడీ ఉత్తరం... అయినా నాకు విశ్వం మీద కోపం, ద్వేషం, అసహ్యం లాంటివి పుట్టలేదు.

అలాగని కోరికా పుట్టలేదు. నా ప్రేమ నా మాటను నిలబెట్టమనే అంటోంది. కానీ రఘురాంకి తెలియకుండా — ఎలా?

నేను తప్పు చేస్తున్నానో, రఘురాంకి అన్యాయం చేస్తున్నానో నాకు తెలియదు. రహస్యం బట్టబయలైతే నా జీవితం ఏమైపోతుందీ తెలియదు. నాలో సంకోచం లేదు. బలహీనతకు లొంగుతున్నానన్న అనుభూతి లేదు.

పచ్చకాగితం కవర్లో పెట్టి విశ్వానికి పోస్టు చేశాను...

* * *

ఆ రాత్రి...

విశ్వానికి నన్ను నేనర్పించుకునేందుకు అన్ని ఏర్పాట్లూ జరిగాయి.

పిల్లలిద్దరూ ఆ ఊళ్ళోనే ఉన్న మా ఆడపడుచింటికి వెళ్ళారు.

ఇంట్లో స్వీట్సు, రకరకాల ఫలహారాలు సిద్ధం చేశాను. అందంగా అలంకరించుకున్నాను. రఘురాం నన్ను చూసి మత్తెక్కిపోయాడు. అతడికి నేనందించిన పాలగ్లాసులోని నిద్రమాత్ర ఆ మత్తును నిద్రమత్తుగా మార్చింది.

కాసేపటికి విశ్వం మాయింటి తలుపులు తట్టాడు. అతడిని నేను పడకగదిలోకి తీసుకుని వెళ్ళాను.

చాలాకాలం తర్వాత ఒకరినొకరు కలుసుకున్నాం. కానీ మాలో అలాంటి అనుభూతి లేదు. ఎంతోకాలంగా కలుసుకుని ఒకరినొకరు చూసుకుంటున్నట్లే ఉంది.

రఘురాం మంచంమీద వళ్ళెరక్కుండా నిద్రపోతున్నాడు. నేనతడికి నల్లని దుప్పటి ఒకటి నిలువునా కప్పి మంచం మీద కూర్చున్నాను.

అప్పటికి విశ్వం మంచం దగ్గర్నుంచి గది గుమ్మం వద్దకు చేరుకున్నాడు. నావంక అభిమానంగా చూస్తూ, "థాంక్స్ సత్యా! నువ్వు నీ ప్రేమను ఋజువు చేసుకున్నావు. మరి నేనూ నా ప్రేమను ఋజువు చేసుకోవాలిగా — వెళ్ళొస్తాను. సెలవు" అన్నాడు.

ఆ తర్వాత మేము మళ్ళీ కలుసుకున్నామా అన్నది అనవసరం. ఇంకే ఋజువూ అవసరం లేకుండానే మా ప్రేమ కలకాలం నిలబడింది — పరస్పరం కారణంగా!

*



## 'అల్లు' ఆశ

పద్మశ్రీ గెలుచుకున్న 'అల్లు' మంచి అల్లుడుని గెలుచుకున్నాడు. సమర్థుడయిన కొడుకు వున్నాడు. మద్రాసులోనూ, హైదరాబాదులోనూ కావలసినంత స్థిరాస్తులూ వున్నాయి. అయితే చిన్నచిన్న ఆశ అంటున్నాడు. అదేవిటంటే పెద్ద తెరమీద పెద్ద పెద్ద పాత్రలు చేసేశాను. ఎటొచ్చి బుల్లితెర మీద మంచి సీరియల్ నటించి ఆ అనుభవం చవిచూడాలని ఆశను వ్యక్తం చేశాడు.

— సాయిరాం

